చిన్నారిపై వీధి కుక్కల దాడి



మెట్‌పల్లి : గాయపడ్డ చిన్నారి

మెట్‌పల్లి, జనవరి 4: పట్టణంలో కుక్కల బెడద తీవ్రమైంది. ప్రజలు వీధి కుక్కల వల్ల ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలు ఇండ్ల ముందు ఆడుకునేందుకు సైతం భయపడుతున్నారు. పట్టణంలోని సుల్తాన్‌పురకు చెందిన ఓ నాలుగేళ్ల చిన్నారిపై గురువారం వీధి కుక్క మీద పడి దాడి చేయడంతో తల భాగంలో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు బాలికను వెంటనే దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. వీధి కుక్కల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అంతర్గత రహదారులపై తిరిగేందుకు ఇబ్బంది పడాల్సి వస్తున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను తప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక

కొడిమ్యాల, జనవరి 4: మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షిల్ ఎస్జీఎఫ్ 67వ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక య్యాడు. బీహార్‌లో జరిగిన అండర్-17 బాలుర క్రికెట్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొననున్నాడు. కాగా డిసెంబర్‌లో గద్వాల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా తరపున ఆడి ప్రతిభ కనబర్చాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు.

బీట్‌లో దినుసుల కొనుగోలు

జగిత్యాల టౌన్, జనవరి 4: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం మక్కలు క్వింటాల్‌కు రూ. 2,101-2,256 చొప్పున ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టీ రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ 1010 రకం ధాన్యానికి రూ.2,055 - 2075, హెచ్ఎంటీ రూ.2,901-2,951, జైశ్రీరాం రూ. 3,025 చొప్పున ధరలు లభించినట్లు వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల, జనవరి 4: మల్యాల ఎక్స్‌రోడ్ చౌరస్తాలో గల లాస్య ప్రాథమికోన్నత పాఠశాలలో నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని రూపొందించిన క్యాలెండర్‌ను పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో చేయించారు. ఇక్కడ పాఠశాల కరస్పాండెంట్ సుష్మారావు, రాజురావు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319403-All
CHANGE OF NAME
★I, ALALA JALANDHAR, R/o. H.No. 1-8, Ammakkapet, Ibrahimpatnam, Jagityal, TS. Changed My Name as ELALA JALANDHAR, S/o. Elala Chinna Gangaram.
NT-319317
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

అర్హులందరికీ పథకాలు అందించాలి

మెట్‌పల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, జనవరి 4:అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం మెట్‌పల్లి పట్టణం 21వ వార్డులోని గోల్ హన్మాన్ ఆలయ ఆవరణలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వంద రోజుల్లో ఆ హామీలను అమలు చేయాలన్నారు. రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా మెట్‌పల్లి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ప్రజాపాలన దరఖాస్తు పత్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఇబ్బందులు లేకుండా దరఖాస్తులను స్వీకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇక్కడ మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్ భీమనాతి భవానీ, డీఈఈ రాజ్‌కుమార్, ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ మనోహర్, ఏఈ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ ఆదర్శనీయుడు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

అంధులను సన్మానిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, అధికారులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 4: లూయిస్ బ్రెయిలీ ఆదర్శనీయుడని, దివ్యాంగులు బ్రెయిలీని ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జగిత్యాలలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రెయిలీ చిత్రపటానికి కలెక్టర్ యాస్మిన్ బాషా, అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, బ్రెయిలీ జీవితాన్ని దివ్యాంగులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఏర్పరుచుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. నిరాశకు లోనుకావద్దన్నారు. వైకల్యాన్ని సామర్థ్యాలుగా మార్చుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. జిల్లాలో సదరం క్యాంపులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ ప్రతిభ ఆధారంగానే లబ్ధి పొందాలన్నారు. బ్రెయిలీ విగ్రహ స్థాపనకు జగిత్యాల మున్సిపల్ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కలెక్టర్ కేక్ కట్ చేసి దివ్యాంగులకు అందజేశారు. పలువురు అంధులను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఇక్కడ జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, సంఘ నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, జనవరి 4: తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోగ రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే రామచంద్రం, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు గొడుగు రఘుపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ రవీందర్, సత్యప్రకాశ్, ఎల్ల గోవర్ధన్, జిల్లా కార్యదర్శులు రాచమల్ల మహేశ్, అప్పాల గంగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

గొల్లపల్లి : గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ కుమార్

పేదలకు పథకాలు అందేలా చూస్తాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, జనవరి 4: పేదలకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గొల్లపెల్లి మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని విప్ గురువారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ, కాంగ్రెస్ పేదల ప్రభుత్వమన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామ పంచాయతీలో శ్మశాన వాటిక, ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడ సర్పంచ్ నిషాంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిషాంత్ రెడ్డి, సర్పంచులు గంగాధర్, సత్యనారాయణ, పద్మ-వెంకటేశ్, తిరుపతి రెడ్డి, మురళి, ఎంపీటీసీ ధనవ్వ-లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతి, విజయ్, ఉప సర్పంచ్ సందీప్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రావు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కొండగట్టు ఆలయ ఈవో

చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన కొండగట్టు ఆలయ ఈవో టంకశాల వెంకటేశం

మల్యాల, జనవరి 4: చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి టంకశాల వెంకటేశంతో పాటు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితుడు తేజేశ్వర్‌శర్మ ఎమ్మెల్యేను వేద మంత్రోచ్చరణలతో ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇక్కడ ఆలయ సూపరింటెండెంట్ సునీల్, ముత్యంపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, శంకర్, అనిల్ ఉన్నారు.

ఏపీ సీఎంకు జడ్పీ చైర్‌పర్సన్ అభినందనలు

జగిత్యాల, జనవరి 4: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత గురువారం స్వాగతం పలికారు. వారి వెంట జడ్పీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి

మల్యాల : బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం సభ్యులు

మల్యాల, జనవరి 4: తాటిపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌కు మ్యాడంపల్లి గ్రామంలో గోదాం నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు కేటాయించాలని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌కు కరీంనగర్‌లో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. తాటిపల్లి, మ్యాడంపల్లికి చెందిన 500 మంది సంఘంలో సభ్యులుగా ఉన్నామని, గోదాం నిర్మాణంతో పాటు కంపోస్ట్ షెడ్ యూనిట్ తయారీకి నాబార్డు ద్వారా రుణం పొంది లబ్ధి పొందుతామని, ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని ఎంపీ సంజయ్‌కుమార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌రెడ్డి, నాయకులు గాజుల మల్లేశం, కొక్కెర మల్లేశం యాదవ్, లక్ష్మారెడ్డి, రైతు సంఘ సభ్యులు భాస్కర్‌రెడ్డి, మల్లయ్య, కిష్టయ్య, రాములు, రవీందర్ పాల్గొన్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన ఎంపీడీవోలు

కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో సంఘ నాయకులు

జగిత్యాల రూరల్, జనవరి 4: కలెక్టర్ యాస్మిన్ బాషా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్‌ను నూతన సంవత్సరం సందర్భంగా ఎంపీడీవో సంఘ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో రఘువరణ్, డీఆర్డీవో నరేశ్, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల సంతోష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రాజేశ్వరి, ఎంపీడీవోలు సంజీవరావు, ప్రభు, జనార్దన్, భీమేశ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

కోరుట్ల, జనవరి 4: పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్ విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా శివారు ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంట పొలాల్లో వరినాట్లు వేశారు. రైతుల ద్వారా వరి ధాన్యం, కూరగాయల సాగు విధానం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేశ్, ప్రిన్సిపాల్ సుధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ పొలంలో వరినాట్లు వేస్తున్న విద్యార్థినిలు

జాబితాపూర్ సర్పంచ్‌గా ఉప సర్పంచ్‌కు బాధ్యతలు

జగిత్యాల రూరల్, జనవరి 4: జాబితాపూర్ ప్రస్తుత సర్పంచ్ ఏ మమతపై నిధులు దుర్వినియోగంపై వచ్చిన అభియోగాలను విచారణ చేపట్టగా దానికి సరైన సమాధానం సర్పంచ్ ఇవ్వకపోవడంతో కలెక్టర్ యాస్మిన్ బాషా సర్పంచ్‌ను పదవి నుంచి తాత్కాలికంగా తొలగించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, డీపీవో దేవరాజ్ ఆదేశాల మేరకు గురువారం ఉప సర్పంచ్ కుంట లక్ష్మారెడ్డిని తాత్కాలిక సర్పంచ్‌గా నియమించారు. ఈ మేరకు లక్ష్మారెడ్డి బాధ్యతలు తీసుకున్నట్లు ఎంపీవో కందుకూరి రవిబాబు పేర్కొన్నారు.

కోరుట్ల ఎమ్మెల్యే పరామర్శ

మల్లాపూర్, జనవరి 4: మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి కుమార్తె సుజాత ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా వీరి కుటుంబ సభ్యులను గురువారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పరామర్శించడంతో పాటు, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఇక్కడ నాయకులు కాటిపల్లి ఆదిరెడ్డి, బండి లింగస్వామిగౌడ్, కట్కం నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

రాయికల్, జనవరి 4: జగిత్యాల సివిల్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న సుభాషిణి రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.8 వేల విలువైన క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడలలో పాల్గొంటున్న విద్యార్థులను ఆమె అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి, శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. క్రీడా సామగ్రిని అందజేసిన సుభాషిణిని హెచ్ఎం శ్రీపతి రాఘవులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, రవీందర్, మల్లేశం, గంగా జమున, సత్యనారాయణ, జ్యోతి, వనజ, నాగరాజు, శ్రావణ్ కుమార్, సుజాత పాల్గొన్నారు.

మహా కాలభైరవ జయంతి

కోరుట్ల రూరల్, జనవరి 4: చిన్నమెట్‌పల్లి గ్రామశివారులో గల శ్రీ మహా కాలభైరవ స్వామి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు చక్రపాణి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

డీఈవో అభినందన

జగిత్యాల, జనవరి 4: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు చెందిన విద్యార్థులు కేరళలో జరిగిన 8వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో మెన్స్ యూత్ టీం తరపున అంకం రిషి, ఎస్ యశ్వంత్, ఏ ప్రణీత్ రజత పతకాలు సాధించారు. అంతే కాకుండా విద్యార్థులు ఇందూరి రిషిక్, బీ శ్రీనివాస్, ఠాకూర్ అభినందన్, ఎస్ కుశల్ సింహా తెలంగాణ సబ్ జూనియర్ టీం తరపున పాల్గొని కాంస్య పథకాలు సాధించారు. ఈ సందర్భంగా డీఈవో జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రజితారావు, డైరెక్టర్లు శ్రీధర్ రావు, బియ్యాల హరి చరణ్ రావు, మౌనికా రావు, పీఈటీ శివ సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 4: పట్టణంలో ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి ఆరు బైకులను రికవరీ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలో పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికాగా, బైక్ యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా, టీఆర్‌నగర్‌కు చెందిన బానాల చిరంజీవి ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లుగా తేలింది. చిరంజీవిపై నిఘా ఉంచగా, పాత బస్టాండ్ వద్ద పట్టుకున్నామని చెప్పారు. జగిత్యాల పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఆరు ద్విచక్ర వాహనాలను దొంగిలించాడని, అతడి వద్ద నుంచి ఆరు బైకులను రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకున్న జగిత్యాల టౌన్ సీఐ సీహెచ్ నటేశ్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ విశాల్‌ను డీఎస్పీ వెంకటస్వామి అభినందించి రివార్డు అందజేశారు.

మారం జగదీశ్వర్‌కు జగిత్యాల టీఎన్జీవో శుభాకాంక్షలు

జగిత్యాల టౌన్, జనవరి 4: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి కరీంనగర్‌కు వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌కు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కరీంనగర్ టీఎన్జీవో భవన్‌కు తొలిసారి వచ్చిన మారం జగదీశ్వర్‌ను టీఎన్జీవో నాయకులు, ఉద్యోగులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమరేందర్‌రెడ్డి, సాహెబ్‌బాబు, రవీందర్, రాములు, రాజేశం, మధుకర్, వెంకటపవన్, సునీత్‌కుమార్, మమత, కే శైలజ, పాల్గొన్నారు.

శ్రీరాముడి అక్షింతలతో ఊరేగింపు

జగిత్యాల టౌన్ : శ్రీరాముడి అక్షింతలను వార్డుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్/మేడిపల్లి, జనవరి 4: జిల్లా కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయం శ్రీరాముల వారి అక్షింతల ఊరేగింపు నిర్వహించారు. అరవిందనగర్, కృష్ణానగర్, బాలాజీనగర్‌లో అక్షింతల వితరణ చేశారు. అలాగే మేడిపల్లి మండలం లింగంపేట గ్రామానికి అక్షింతలు చేరుకున్నాయి. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వంగ వెంకటేశం, అభయ ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

సారంగాపూర్: మ్యాడారం తండా గ్రామంలో దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్న అధికారులు

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతున్నది. షెడ్యూల్ ప్రకారం నిర్ణయించిత తేదీల్లో గ్రామాల్లో అభయహస్తం గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ధర్మపురిలో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తమ్మ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కోరుట్ల పట్టణంలోని పలు వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

- జగిత్యాల నెట్‌వర్క్, జనవరి 4

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, జనవరి 4: పెద్దాపూర్ బాలుర గురుకుల విద్యాలయం, జూనియర్ కళాశాల సంస్కృతి ఉపన్యాసకుడు, పద్యకవి బీ వెంకట్ రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు-2024కు ఎంపికయ్యారు. ఆంధ్రా సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాల ప్రాంగణంలో జనవరి 5, 6, 7వ తేదీల్లో జరిగే రెండో అంతర్జాతీయ మహాసభల్లో పాల్గొననున్నారు. మహా కవి సమ్మేళనంలో పాల్గొని భారతీయ సంస్కృతి వైభవంపై పద్యాలను ఆలపించనున్నట్లు వెంకట్ తెలిపారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ కోచ్‌గా శ్రీరాం

జగిత్యాల రూరల్, జనవరి 4: జనవరి 3 నుంచి ఛత్తీస్‌ఘడ్‌లో ప్రారంభమైన జాతీయస్థాయి ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల టీంకు బాస్కెట్‌బాల్ జట్టు కోచ్‌గా స్కీర్మిష్ బాస్కెట్‌బాల్ అకాడమీ కోచ్ శ్రీరామ్ ఎంపికయ్యాడు. జగిత్యాల నుంచి జాతీయ స్థాయిలో కోచ్‌గా ఎంపిక అవడంపై జిల్లా పీఈటీలు ఆయనను అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 4: పెంచిన వేతనాలను, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి ఆదుకోవాలని, సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టన్నోజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి తాడెపు భాగ్యలక్ష్మి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన నియామకం

మెట్‌పల్లి, జనవరి 4: దేవత పోతరాజు బైండ్ల సంఘం మెట్‌పల్లి పాతతాలుక నూతన కార్యవర్గాన్ని గురువారం పట్టణంలోని సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంబటి జలంధర్, ఉపాధ్యక్షుడిగా ద్యావతి పశుల ప్రకాశ్, కోశాధికారిగా సత్యనారాయణ, సలహాదారులుగా సురేశ్‌రాజు, కంటె మునీందర్, పబ్బ మారుతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గెజిటెడ్ లెక్చరర్స్ కార్యవర్గం

జగిత్యాల టౌన్, జనవరి 4: జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మేఘశ్యాం ఆధ్వర్యంలో కార్యవర్గ విస్తరణ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే మేఘశ్యామ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మెండు సతీశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బీ మోహన్‌రావు, స్టేట్ కౌన్సిలర్‌గా బుక మహేశ్, మహిళా కార్యదర్శిగా బీ రాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరామర్శ

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 4: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వావిలాల గంగాధర్ తండ్రి బక్కయ్య గుండెపోటుతో మృతిచెందగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సతీమణి రాధిక వారి కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే సతీమణి వెంట కౌన్సిలర్ ఒద్ది శ్రీలత ఉన్నారు.

బకాయిలు చెల్లించాలి

పెగడపల్లి, జనవరి 4: నంచర్ల సహకార సంఘం పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులు మార్చిలోగా రుణ బకాయిలు చెల్లించి, సంఘ అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ మంత్రి వేణుగోపాల్ కోరారు. గురువారం సంఘ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఈవో రౌతు మధుకర్, వైస్ చైర్మన్ నామ సురేందర్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ రాజు ఆంజనేయులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రైస్‌మిల్ కాలుష్యాన్ని అరికట్టాలని ఆందోళన

రాయికల్, జనవరి 4: పట్టణంలో జనవాసాల మధ్య ఉన్న రైస్ మిల్ నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, రైస్ మిల్ కాలుష్యాన్ని అరికట్టాలని కోరుతూ కాలనీవాసులు గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.